క్లుప్తంగా

దివ్యాంగుడికి ఆర్థిక సాయం



దివ్యాంగుడు ఆలీకి ఆర్థిక సహాయం అందజేస్తున్న కంబాల శ్రీనివాస్‌రావు

గోకవరం: రోడ్డు ప్రమదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న వ్యక్తికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆర్థిక సహాయం అందజేశారు. జగ్గంపేటకు చెందిన షేక్ ఆలీ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లను పోగొట్టుకున్నాడు. ఆదివారం తనకు ఆర్థిక సహాయం చేయాలని గోకవరంలో శ్రీనివాస్‌రావుని ఆశ్రయించగా తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేశారు. ఆయనకు అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ అమ్మవారి తీర్థం



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లి మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లారీఓనర్స్‌అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద కొలువైన అమ్మవారి ఆలయం భక్తులతో కళకళలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

సీఆర్పీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంజీ ప్రసాద్



ఎలిపే రాంజీ ప్రసాద్

ప్రత్తిపాడు: రాష్ట్ర సీఆర్పీల సంఘం అధ్యక్షుడిగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సీఆర్పీ ఎలిపే రాంజీ ప్రసాద్ ఎన్నికయ్యారు. విజయవాడ జాక్ అండ్ జిల్ రైల్వే పాఠశాలలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ రీసోర్సు పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీసీఆర్పీడబ్ల్యూఏ) రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నట్టు ఆ సంఘ గౌరవాధ్యక్షుడు వి.విష్ణువర్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎలిపే రాంజీ ప్రసాద్‌ను ఎంఈఓలు వి.రాజబాబు, వై.అచ్చిరాజు, సీఆర్పీలు ఎస్.అప్పన మల్లేష్, కె.గంగారావు, భాషా, యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడిలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

అల్పపీడనంతో తీరంలో అలజడి



అద్దరిపేట తీరంలో బోటును ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు

తొండంగి: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సముద్ర తీరంలో అలల ఎగసిపడుతున్నాయి. వాతావరణం ప్రతికూలంగా ఉండడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఏపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈనేపథ్యంలో మండలంలోని దానవాయిపేట, అద్దరిపేట, కొత్తబోడిపల్లిపేట, యర్రయ్యపేట, కొత్తపేట తదితర తీరప్రాంతాల్లో మత్స్యకారులు తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. సముద్రంలో సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకూ వేటకు వెళ్లరాదని తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రకటించారు.

సరస్వతీ నిలయాల్లో సమస్యలు

దేశ భవిష్యత్తుకు విద్యార్థులే దిక్సూచి. వారు అభివృద్ధే దేశ సంపద. విద్యార్థుల చదువు సజావుగా సాగేందుకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించాలి. గత ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి.. సర్కారు బడులతో పాటు, విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలన్నీ సమృద్ధిగా కల్పించింది. కార్పొరేట్ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చింది. తాజా ప్రభుత్వం వీటన్నింటినీ పక్కనపెట్టేసిందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు మాసాలు గడచినా.. ఇంకా పాఠశాలల్లో స్టూడెంట్ కిట్లంటూ విద్యార్థులకు అరకొర వస్తువులు పంచుతుండడం.. ఆయా విమర్శలకు అద్దం పడుతోంది. విద్యా రంగ పథకాలను ముమ్ముందు ఏం చేస్తుందోనన్న అనుమానాలు ప్రజానీకాన్ని పట్టి పీడిస్తున్నాయి.

- అరకొరగా విద్యా కానుక కిట్ల పంపిణీ
- విద్యార్థులకు తగ్గట్టు లేని ఉపాధ్యాయులు
- నాసిరకం భోజనంతో బాలల ఇబ్బందులు
- పట్టించుకోని ప్రభుత్వం

తుని: విద్యా ప్రమాణాలు ఉన్నతంగా ఉండాల్సిన సరస్వతి నిలయాల్లో సమస్యలు కొలువై ఉన్నాయి. స్కూళ్లు ప్రారంభమైన రెండున్నర నెలలు గడుస్తున్న సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల్లో అన్ని సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎన్నికల వల్ల కొంత సమయం పట్టినా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా పాఠశాలల సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. అమ్మఒడి రాలేదు, విద్యా కానుక కిట్లు పంపిణీలో జాప్యం, సరైనా సమయంలో ఉపాధ్యాయుల బదిలీలు జరగలేదు, ఒకే గదిలో రెండు, మూడు తరగతుల నిర్వహణ, ఉచితంగా అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత లేకపోవడం తదితర అంశాలలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిపై 'సాక్షి' అందిస్తున్న కథనం.

ఇదీ పరిస్థితి

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో 105 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 66 యూపీ పాఠశాలలు, 415 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 94,414 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని సబ్జెక్టులకు సంబంధించి 2,304 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా ప్రస్తుతం 2,259 మంది ఉన్నారు. ఇంకా 88 మంది ఉపాధ్యాయులు అవసరం. గత ప్రభుత్వ హయంలో ఉపాధ్యాయుల బదిలీలు జరిగినా ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిలిపి వేయడంతో సమస్యలు నెలకొన్నాయి.

తుని నియోజకవర్గానికి సంబంధించి ఉపాధ్యాయుల కొరత లేదు. ప్రత్తి పాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఉపాధ్యాయుల కావాల్సి ఉంది.



ప్రత్తిపాడు యానాదిపేటలో ఏకోపాధ్యాయ ఉన్న ఎంపీపీ పాఠశాల

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య	జెడ్పీ	యూపీ	ప్రాథమిక	విద్యార్థులు
తుని	211	39	66	154	37,148
ప్రత్తిపాడు	174	35	18	121	20,835
జగ్గంపేట	201	31	30	140	36,431

దీంతో ప్రాథమిక పాఠశాలల్లో రెండు లేక మూడు తరగతులకు చెందిన విద్యార్థులను ఒకే దగ్గర కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భోజనం తినలేక..

మూడు నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు గత ప్రభుత్వ హయాంలో రోజు వారీ మెనూ అమలు చేశారు. ఏ రోజు ఏమి వంటకాలు పెట్టాలో ముందుగానే బోర్డులో పెట్టారు. ప్రస్తుతం ఇంప్లిమెంట్ ఏజెన్సీలు మారడంతో రోజు వారీ సరఫరా చేసే భోజనాల్లో నాణ్యత లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అందించే భోజనం తినలేక 10 నుంచి 15 శాతం మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారేజ్‌లు తీసుకువస్తున్నారు. విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

నియోజకవర్గం	ఉపాధ్యాయుల సంఖ్య	ఉన్న వారు	ఉన్న కొరత
తుని	820	810	10
ప్రత్తిపాడు	745	700	45
జగ్గంపేట	782	749	33
మొత్తం	2304	2259	88

ఉపాధ్యాయుల కొరత

గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలకు స్వీకారం చుట్టారు. రేషనలైజేషన్ పద్ధతిలో ఉపాధ్యాయులను భర్తీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కొందరు కోర్టుకు వెళ్లడం, ప్రస్తుత ప్రభుత్వం నిలిపి వేయడంతో సమస్య నెలకొంది. మూడు నియోజకవర్గాల పరిధిలో 88 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇందులో ఎక్కువగా జగ్గంపేట నియోజకవర్గంలో ఉంది. తునికి సంబంధించి అంతగా సమస్యల లేదు. ప్రత్తిపాడుకు సంబంధించి 33 మంది కొరత ఉంది. దీంతో ఒకే క్లాస్‌రూంలో 2 లేక 3 తరగతులకు సంబంధించిన విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని ఉప్పలపాడు, కే గోపాలపురం, యల్లమిల్లి తదితర గ్రామాల్లో తెలుగు, హిందీ, పీఈటీల కొరత ఉంది. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను పంపిస్తున్నారు. సకాలంలో ఉపాధ్యాయుల బదిలీలు జరిగి ఉంటే సమస్య ఉండేది కాదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

కిట్ల పంపిణీలో జాప్యం

విద్యార్థులకు అవసరమైన విద్యా కానుక కిట్లను గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. మండల కేంద్రాలకు విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు, పుస్తకాలు, బ్యాగులు, షూలు తదితర వాటిని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అందుబాటులో ఉంచారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ఎన్నిక కౌంటింగ్ నిర్వహణ, ప్రభుత్వం మారడం తదితర కారణాలతో పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాయమ ఉపాధ్యాయుడు కావాలి



గ్రామంలోని కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యార్థులకు సంఖ్యను బట్టి ఇక్కడ ఇద్దరు పీఈటీలు ఉండాలి. కానీ ఒకరే ఉండడంతో విద్యార్థులకు క్రీడలలో శిక్షణ ఇవ్వడం ఇబ్బందిగా మారింది. అధికారులు చొరవ తీసుకుని పీఈటీలను నియమించాలి.

–ఎస్ఎస్ రామ్‌కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కిర్లంపూడి

సరిపడే గదుల్లేక..



ప్రభుత్వ హైస్కూళ్లలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తరగతి గదులు లేక ఒకే గదిలో రెండు తరగతులు, వరండాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. నాడు–నేడులో నిర్మించిన అదనపు తరగతి గదులు దాదాపు పూర్తయినా ప్రస్తుతం నిధుల్లేక తుది దశ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తి చేయాలి.

– వాడపర్తి సుబ్బు, విద్యార్థి తండ్రి, కోటనందూరు

వనదుర్గమ్మకు ప్రత్యంగిర హోమం

పాల్గొన్న 115 మంది భక్తులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ అమావాస్య పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం ప్రారంభించారు. 11గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలు వేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరజన మంత్రపుష్పాలు, నైవేద్యాలు సమర్పించారు. ఈ హోమంలో 97 మంది భక్తులు ప్రత్యక్షంగాను, 18 మంది భక్తులు పరోక్షంగాను పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు వేదపండితులు గంగాధరబట్ల గంగబాబు ఘనపాఠి, అర్చకులు కోట వంశీ, పరిచారకులు ఫణిశర్మ, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు నిర్వహించారు.



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు



హోమ మండపం సరిపోక ఇరుకిరుకుగా కూర్చున్న భక్తులు

హోమ మండపం సరిపోక..

హోమంలో ఎక్కువ మంది భక్తులు పాల్గొనడంతో హోమ మండపం సరిపోక భక్తులు ఇబ్బంది పడ్డారు. చాలామంది మండపానికి ఎదురుగా ఉన్న రోడ్డుపై నిలబడాల్సి వచ్చింది. ఏడాది క్రితం వరకూ చండీ, ప్రత్యంగిర హోమాలు పౌర్ణిమ వనదుర్గ ఆలయంలో జరిగేవి. అయితే గతంలో ఆలయానికి దిగువన ఉన్న స్టోర్ రూమ్‌ను శుభ్రం చేసి హోమగుండం నిర్మించి హోమాలను అక్కడే చేస్తున్నారు. ఇక్కడ హోమంలో పొగ బయటకు వెళ్లే అవకాశం తక్కువ. ఆలయంలో హోమం నిర్వహించేటప్పుడు చుట్టూ గల గ్రిల్స్ లోంచి పొగ పోయేది. ఇప్పుడు అవకాశం లేక హోమం చేసే అర్చకులు, పురోహితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ హోమాలను వనదుర్గ ఆలయంలో చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి శ్రావణమాసం పూజలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దివ్య సన్నిధిలో శ్రీలక్ష్మీదేవి అమ్మవారికి సోమవారం నుంచి సెప్టెంబరు రెండు వరకూ శ్రావణ మాసం పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం నవ కలశాలతో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ఉత్సవ ఆరంభ స్నపనం, 7న గోదాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, 9న తొలి శ్రవణ శుక్రవారం పూజలు, అలాగే అమ్మవారికి పసుపు, కుంకుమ, వివిధ రకాల గాజులతో అంకరణ చేయనున్నట్టు తెలిపారు. 16న రెండో శ్రవణ శుక్రవారం పూజలు, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, లక్ష్మీనారాయణ దివ్య కల్యాణ మహోత్సవం, ధనలక్ష్మి అలంకరణ, సహస్ర దీపాలంకరణ ఏర్పాటు చేస్తామన్నారు. 18న లక్ష్మీదేవి పుష్కరిణిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ వరహాస్వామి వారికి పంచామృతాభిషేకాలు, 19న ప్రసన్న వేంకటేశ్వరస్వామికి, పరివార దేవతలకు 108 కలశాలతో పంచామృతాభిషేకాలు, 23న మూడో శుక్రవారం పూజలు, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సర్వఫల ప్రదాయని అలంకరణ, స్వర్ణపుష్పార్చన, సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. 27న గోకుల అష్టమి సందర్భంగా ఆలయం వద్ద ఉట్టి కొట్టు ఉత్సహం, దీపాలంకర సేవ, తీర్థప్రసాద గోష్ఠి, 30న నాలుగో శ్రవణ శుక్రవారం పూజలు, సౌభాగ్యదాయిని అలంకరణ, లక్ష కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణ నిర్వహించనున్నట్టు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం టైరే ఉపాయం

- ఛిద్రమైన తుని–నర్సీపట్నం రోడ్డు
- గుంతల్లో చేరిన వర్షపు నీరు



కాకరాపల్లి శివారులో తుని-నర్సీపట్నం రోడ్డు మధ్యలో పడిన గుంతకు హెచ్చరికగా ఉంచిన టైరు

కోటనందూరు: రోడ్డు మధ్యలో టైర్ ఎందుకు పెట్టారనుకుంటున్నారా.. ఈ టైరే ప్రస్తుతం ప్రమాదాలను అరికట్టనుంది. టైర్ ఉన్న చోట పెద్ద గుంత ఏర్పడింది. ఈ గుంతలో వర్షపు నీరు చేరడంతో తెలియక వాహనదారులు ప్రమాదాన పడుతున్నారు. దీనిపై అప్రమత్తం చేసేందుకు స్థానికులు టైరును ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుని–నర్సీపటన్ం రోడ్డు ఛిద్రమైంది. మండలంలోని తాటిపాక నుంచి కాకరాపల్లి శివారు వరకూ అనేక ప్రాంతాల్లో రోడ్డు పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాకరాపల్లి శివారులో రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. రోడ్డు మధ్యలో భారీగా పడిన గుంతలో వర్షపునీరు చేరడంతో అంచనా వేయలేని వాహనచోదకులు అనేకమంది ప్రమాదాల బారిన పడ్డారు. దీంతో స్థానికులు గుంతకు సూచికగా టైరును ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ప్రయాణం వర్ణనాతీతంగా మారింది. రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెత్త కుప్పలుగా రహదారులు



కప్పలచెరువు వద్ద రహదారిపై పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లోని రహదారులు చెత్తకుప్పలను తలపిస్తున్నాయి. రహదారులపై చెత్త పేరుకుపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కప్పలచెరువు, నందివీధి, పెద్దవీధి తదితర ప్రాంతాల్లో చెత్త రహదారులపై దర్శనమిస్తోంది. రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం ఏర్పడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో పాటు రహదారులపై నిల్వ ఉండిపోవడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పట్టణంలో దోమల బారినపడి డెంగీ, డయేరియా, మలేరియా వంటి వ్యాధులతో ప్రజలు ఇప్పటికే అనారోగ్య పాలయ్యారు. చెత్తతోపాటు దోమలు విచ్చలవిడి పెరిగిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇది సరిపడదన్నట్టు పందుల సంచారం మరింత ఎక్కువైంది. అధికారులుస్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నందివీధిలో గుంపులుగా ఉన్న పందులు



పెద్దవీధిలో జనవాసాల మధ్యే చెత్తకుప్ప

భర్త కనిపించడంలేదని ఫిర్యాదు

జగ్గంపేట: భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ రామచంద్రరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జూన్ 27న జగ్గంపేట గోపాల్‌నగర్‌కు చెందిన తూతిక శివప్రసాద్ మద్యం సేవిస్తూ ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వడంలేదని భార్య వీరలక్ష్మి మందలించడంతో అప్పటి నుంచి కనిపించడంలేదు. బంధువులు, తెలిసినచోట వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.


మొక్కలు నాటండి.. జీవరాశులను కాపాడండి



రాఘవపట్నంలో పండ్ల జాతి మొక్కలను నాటుతున్న రౌతులపూడి అటవీ సెక్షన్ అధికారి నాగేశ్వరరావు

రౌతులపూడి: అటవీ ప్రాంతంలో పండ్ల జాతి మొక్కలను నాటడం ద్వారా సమస్త జీవరాశులను సంరక్షించుకోవచ్చునని రౌతులపూడి అటవీశాఖ అధికారి జి.నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తుని మండలం తేటగుంట తిమ్మాపురానికి చెందిన సంకల్పం సేవా సంస్థ ఆధ్వర్యంలో ×ప్రాజెక్టు వానర☆ పేరుతో రాఘవపట్నం రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో పలు పండ్లజాతి మొక్కల నాటే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. అటవీ ప్రాంతంలో జామ, ఉసిరి, నేరేడు, మామిడి, సీతాఫలం వంటి పలు పండ్ల జాతి మొక్కలను పెంచడం వలన అటవీ ప్రాంతంలో జీవించే పక్షులు, ఇతర జీవరాశులకు ఆహారం అందించవచ్చని అన్నారు. అంతేకాకుండా మైదాన ప్రాంతంలో కోతులు, ఇతర జీవరాశుల బెడదతో పంటలు నష్టపోతున్న రైతాంగానికి వాటి నుంచి కొంత మేరకు పంటలను రక్షించుకునే వీలుంటుందన్నారు. ప్రాజెక్టు వానర పేరుతో వివిద పండ్ల జాతులకు చెందిన 622 మొక్కలను ఏర్పాటు చేసి అటవీ ప్రాంతంలో నాటిని సంకల్పం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి యాళ్ల ప్రసాద్, సంకల్పం ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కె.బీమారావు, రాజ్‌కుమార్, శ్రీవిద్య, సంకల్పం ప్రతినిధులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పంట



జగపతినగరంలో నీట మునిగిన వరి పంటలు

కిర్లంపూడి: మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మెరక నుంచి వచ్చిన వరద నీటి వల్ల జగపతినగరంలోని సుమారు 20 ఎకరాలు వరి పంట పూర్తిగా ముంపునకు గురైంది. వర్షపు నీరు దిగువకు పోయే కమ్మరమాణ్యం కాలువలో తుప్పలు పెరిగిపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని రైతులు అవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలలో కాలువ అభివృద్ధి పనులు చేయాలని అధికారులను కొరగా కొన్ని రోజులు మాత్రమే పనులు చేసి మధ్యలో వదిలేయడంతో ఈ దుస్థితి నెలకొందని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. చేసేది ఏమి లేక రైతులందరూ కలిసి కాలువను బాగుచేసుకుంటున్నామని రైతులు వాపోయారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తుని: స్థానిక రాజా హైస్కూల్లో 2004లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆ వారంతా ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. చదుతుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా సందడి చేశారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు రూ.40 వేల విలువ చేసే ఆర్వో ప్లాంటును బహూకరించి హెచ్‌ఎం శేఖగిరిరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రూపాదేవి, ఉపాధ్యాయులు స్వర్ణలత, మంగాదేవి, వాసుదేవరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యశాస్త్రి, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేస్తా



శ్రీనివాసరావును అభినందిస్తున్న సంఘ సభ్యులు

కిర్లంపూడి: విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని అధ్యక్షుడు గానుగుల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద ఆదివారం మండల అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడిగా గానుగుల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడిగా కొత్తల శ్రీనివాసరావు, కార్యదర్శులుగా నాగబ్రహ్మచారి, కాండ్రెగుల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి వీరబ్రహ్మం, కొత్తల వీరప్రసాద్, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.